APBIL/26/A4072.

# గోదావరి భవిష్యత్ వార్త

గోదావరి స్పెషల్ బులిటెన్

తెలుగు దినపత్రిక

సంపుటి : 1 | సంచిక : 102 | ఆగస్టు 30 ఆదివారం 2026 | పేజీలు : 8 | వెల : 2 రూ.

## బిచ్చగత్తె ఇంట్లో 3.50 లక్షల నగదు!

బెంగళూరు : కర్ణాటక రాష్ట్రం మండ్య జిల్లాలో మరో బిచ్చగత్తె ఇంట మూటలు మూటలు నాణేలు, కరెన్సీ నోట్లు లభించాయి. ఈ నెల 22న మండ్య పట్టణంలో గుత్తలు కాలనీకి చెందిన వృద్ధురాలు నూరీ ఇంట్లో రూ.8 లక్షల నగదు లభించింది. తాజాగా మండ్య జిల్లా శ్రీరంగపట్టణంలోని పూర్ణయ్యవీధిలో సావిత్రి అనే యాచకురాలి ఇంట్లోనూ పది సంచుల నాణేలు, రెండు సంచుల్లో నోట్లు అభించాయి. వృద్ధురాలైన సావిత్రి బిచ్చమెత్తుకుని జీవనం సాగిస్తున్నారు. ఇంట్లో ఒక్కరే ఉంటున్న ఆమె. గురువారం ఇంటి నుంచి బయటకు రాకపోవడంతో స్థానికులు అనుమానంతో వెళ్లి చూశారు. అనారోగ్యంతో బాధపడుతున్నట్టు గుర్తించి, అవసరమైన ఆహారం, ఇతర సౌలభ్యాలు సమకూర్చారు. ఆ సమయంలో వృద్ధురాలి ఇంట్లో మూటలను గమనించి, వాటిని విప్పిచూశారు. సంచుల్లో నాణేలు, కరెన్సీ ఉండటంతో స్థానిక యువకులు రెండురోజులపాటు లెక్కించారు. మొత్తంగా రూ.3.50 లక్షలకుపైగా నగదు ఉన్నట్టు తేల్చారు. ఆ సొమ్మును ఆమె పేరిట బ్యాంకులో డిపాజిట్ చేయాలని స్థానికులు నిర్ణయించారు.

## మధ్య ఆసియాపై భారత్ ఫోకస్.. మోదీ కీలక పర్యటన

మధ్య ఆసియాలో భారత్ వ్యూహాత్మక, ఆర్థిక సంబంధాలను మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాలుగు రోజుల పర్యటనకు శనివారం శ్రీకారం చుట్టనున్నారు. ఆగస్టు 29 నుంచి సెప్టెంబరు 1 వరకు ఉజ్బెకిస్థాన్, కిర్గిజిస్థాన్‌లలో ఆయన పర్యటించనున్నారు. తొలుత తాష్కెంట్ చేరుకోనున్న మోదీ.. ఉజ్బెకిస్థాన్ అధ్యక్షుడు షవ్‌కత్ మిర్జియోయెవ్‌తో ద్వైపాక్షిక చర్చలు నిర్వహించనున్నారు. అనంతరం బిష్కెక్‌లో జరిగే షాంఘై సహకార సంస్థ(ఎస్‌సీఓ) 26వ శిఖరాగ్ర సమావేశంలో పాల్గొననున్నారు. ఈ పర్యటనలో భాగంగా తాష్కెంట్‌లోని లాల్ బహదూర్ శాస్త్రి స్మారకాన్ని, మహాత్మా గాంధీ కేంద్రాన్ని మోదీ సందర్శించనున్నారు. ఆ తర్వాత కిర్గిజిస్థాన్ రాజధాని బిష్కెక్‌కు వెళ్లనున్నారు. ఆగస్టు 31, సెప్టెంబరు 1న జరిగే ఎస్‌సీఓ సదస్సులో ఆయన ప్రసంగించనున్నారు. భద్రత, అనుసంధానం, అవకాశాలు అనే మూడు అంశాలను భారత్ కీలకంగా ప్రస్తావించనున్నారు. ఈ ఏడాది 25వ వార్షికోత్సవాన్ని నిర్వహించుకుంటున్న ఎస్‌సీఓలో.. భారత్ 2017 నుంచి పూర్తి సభ్యదేశంగా కొనసాగుతోంది. ఈ సదస్సు సందర్భంగా పలు దేశాధ్యక్షులతో ద్వైపాక్షిక భేటీలూ జరిగే అవకాశముంది. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో మోదీ సమావేశం కూడా ఖరారైనట్లు సమాచారం.

# ప్రధానిగా మోడీకే చాన్స్



నరేంద్ర మోడీ ఒక సాధారణ ఆర్ఎస్ఎస్ కార్యకర్త గా ఉంటూ బీజేపీలో చేరి ఈ రోజుకు నాలుగు దశాబ్దాలు అయింది. అందులో ఆయన పాతికేళ్ళ పాటు ముఖ్యమంత్రిగా ప్రధానిగానే పనిచేశారు. అజేయుడు గా గుర్తింపు ఉంది. ముఖ్యమంత్రిగా కానీ ప్రధానిగా కానీ ఓటమిని అందుకోలేదు. ఆయన పట్ల గుజరాత్ రాష్ట్ర ప్రజలు ఎలా అభిమానం చూపించారో అలాగే దేశ ప్రజలు కూడా ఆరాధిస్తున్నారు, దానికి కారణం ఏమిటి అన్నదే పెద్ద చర్చగా ఉంది. మోడీ వర్సెస్ అదర్స్ అంటే ఆయన దరి దాపుల్లోకి కూడా ఎవరూ రాని పరిస్థితి ఉంది. మరే ఇతర ప్రధానికి లేని క్రేజ్ ఇది. నిజానికి పుష్కర కాలంగా మోడీ ప్రధానిగా ఉన్నారు. ఆయన గ్రాఫ్ పడిపోవాలి, వేరొకరు ఆ చాన్స్ తీసుకోవాలి. కానీ అదేమీ జరగడం లేదు, సమీపంలో జరుగుతుంది అన్న ఆశ లేదు, ఎందుకంటే మూడ్ ఆఫ్ ది నేషన్ లో వచ్చిన రిజల్ట్ చూస్తే మోడీకి ఇతరులకు మధ్య ఓట్ల శాతంలో భారీ గ్యాప్ కనిపిస్తోంది. ఈ రోజున దేశంలో ఉన్న పార్టీలలో పెద్ద పార్టీగా బీజేపీ ఉంది. అందులో రెండవ మాటకే చాన్స్ లేదు. అలాగే దేశంలో అధికారంలో ఉన్న పార్టీగా కూడా బీజేపీ ఉంది. కాంగ్రెస్ అయితే సొంతంగా వంద సీట్లను తెచ్చుకోవడానికి కష్టపడుతోంది. కాంగ్రెస్ లో సీనియర్లు అందరూ వృద్ధులుగా మారిపోయారు. ఇక రాహుల్ గాంధీ మోడీతో పోటీ పడుతున్నారు. అలా మోడీ వర్సెస్ రాహుల్ అని ఎపుడు ఓటింగ్ పెట్టినా మోడీ గెలుస్తున్నారు. ఆయన అందనంత ఎత్తులో ఉంటే సగం ఓట్లతోనే రాహుల్ గాంధీ సరిపెట్టుకోవాల్సి వస్తోంది. దీనికి కారణాలు ఏమిటి అంటే జనాలు అంతా మోడీ వైపు ఉన్నారని కాదు కానీ మోడీ లాంటి మరో నాయకుడు బలమైన ప్రత్యర్థిగా లేకపోవడమే కీలకమైన కారణం అని అంటున్నారు. ఇదిలా ఉంటే గతంతో పోలిస్తే ప్రధానిగా మోడీకి పడిన ఓటింగ్ లో దాదాపుగా ఆరు శాతం తగ్గింది. అయినా కూడా మోడీయే నంబర్ వన్ గా ఉన్నారు. తాజాగా ఇండియా టుడే - సి ఓటర్ సంయుక్తంగా నిర్వహించిన మూడ్ ఆఫ్ ది నేషన్ ఆగస్టు 2026 సర్వేలో ప్రధాని నరేంద్ర మోదీ దాదాపు 49 శాతం మద్దతుతో దేశంలో తదుపరి ప్రధానమంత్రిగా ప్రజల మొదటి ఎంపిక గా నిలిచారు. ఆయన తర్వాత స్థానంలో రాహుల్ గాంధీ 27.1 శాతం మద్దతుతో చాలా వెనుకబడి ఉన్నారు. ఇక మోదీ ప్రజాదరణలో స్వల్ప తగ్గుదల కనిపించింది. ఇదే ఏడాది జనవరిలో 55 శాతం నుండి ఇప్పుడు 49 నమోదైనప్పటికీ, ఆయననే ముందు వరుసలో ఉంచడానికి గల ప్రధాన కారణాలు అనేకం ఉన్నాయి. అందులో కీలకమైనవి ప్రస్తావించుకోవాలి. ాశ్రీంశీ =ఘుస - రంగంలోకి ధర్మాన వారసుడు ? ప్రపంచ పరిణామాలు సైతం : ఇక మోడీ బలమైన జాతీయ నాయకుడు అని జనాలు ఎక్కువగా నమ్ముతున్నారు. ఆయన అధికారంలో ఉంటే దేశం సురక్షితంగా ఉంటుంది అని కూడా నమ్ముతున్నారు. ఈ రోజున ప్రపంచం అంతా యుద్ధం అంచున ఉంది. ఇక భారత్ కి ఇరుగు పొరుగు దేశాలు కూడా అవకాశం కోసం ఎదురుచూస్తున్నాయి. వాటికి గుణపాఠం చెప్పాలంటే రాజీ పడని బలమైన నాయకత్వం అవసరం అని సగటు ప్రజానీకం భావిస్తోంది. అదే మోడీ పట్ల అభిమానం చూపించడానికి కారణం అవుతోంది. దానికి తోడు బీజేపీ జాతీయ భావన అన్నది కూడా గడచిన పన్నెండేళ్ళ కాలంలో దేశంలో బలంగానే వ్యాపించింది. గతంతో పోలిస్తే హిందూ ఓట్ల పోలరైజేషన్ కూడా బాగానే గట్టి పడింది అని అంటున్నారు. దేశంలో 2014 ముందు వరకూ సంకీర్ణ ప్రభుత్వాలు దేశంలో కనిపించేవి. రాజకీయంగా అనేక పార్టీల సమ్మేళనంతో పాలన సాగింది. కానీ మోడీ వచ్చాక ఒకప్పటి ఇందిరా గాంధీ నెహ్రూ లాంటి బలమైన ప్రధానిగా కనిపించడం కూడా ఒక కారణం. రెండో మాట లేకుండా ఆయన నాయకత్వంలో బలమైన ప్రభుత్వం దేశంలో ఉంది. ఇది సగటు జనాలకు నచ్చుతోంది అని అంటున్నారు. అందుకే దేశంలో రాజకీయ స్థిరత్వాన్ని మెచ్చుకుంటూ 13 శాతం మంది ఓటేశారు. బలమైన నిర్ణయాత్మక నాయకత్వం మోదీ వల్లనే సాధ్యమని మెజారిటీ ప్రజలు నమ్ముతున్నారు. ఇవి కూడా కారణాలు : ఇక దేశంలో మోడీ హయాంలో సంక్షేమ పథకాలు మౌలిక వసతులతో చేపట్టిన భారీ మౌలిక సదుపాయాల కల్పనకు కూడా 11 శాతం మంది ఓటేశారు. డిజిటల్ ఇండియా విప్లవం మరియు గ్రామీణ స్థాయి వరకు అందుతున్న వివిధ సంక్షేమ పథకాలు ఆయనకు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పటిష్టమైన ఓటు బ్యాంకును అందించాయని అంటున్నారు. అలాగే సాంస్కృతిక జాతీయ వాదం, అయోధ్యలో రామమందిర నిర్మాణం వంటి వాటికి 11 శాతం మంది ఆకర్షితులై ఓటేశారు. జమ్మూ కాశ్మీర్‌లో ఆర్టికల్ 370 రద్దు వంటి అంశాలు దేశంలో హిందుత్వ ఓటర్లను జాతీయవాద భావాలు గలవారిని మోదీ వైపు గట్టిగా నిలబెట్టాయని అంటున్నారు. ఇక అంతర్జాతీయ వేదికలపై భారతదేశ ప్రతిష్టని పెంచడంతో పాటు ప్రపంచవ్యాప్తంగా భారతదేశం స్థానాన్ని, గౌరవాన్ని మోదీ పెంచారని 19 శాతం మంది ప్రజలు బలంగా విశ్వసిస్తున్నారు. ఆ ఇమేజ్ తోనే : అంతే కాదు గ్లోబల్ లీడర్‌గా మోడీకి ఉన్న ఇమేజ్ దేశీయంగా ఆయన మైలేజీని పెంచుతోంది. ఇక రాజకీయంగా చెప్పాలంటే మోడీకి ఈ రోజుకి కూడా దేశంలో బలమైన ప్రత్యామ్నాయం లేకపోవడం అన్నది వాస్తవం. ప్రతిపక్ష కూటమిగా ఇండియా కూటమి ఎంతో కొంత పుంజుకుంటున్నప్పటికీ, జాతీయ స్థాయిలో నరేంద్ర మోదీకి దీటైన ప్రత్యామ్నాయంగా ఎదగలేకపోతోంది. అందుకే రాహుల్ గాంధీ కంటే మోదీ రేటింగ్ చాలా ఎక్కువగా ఉండటమే దీనికి నిదర్శనంగా విశ్లేషణలు ఉన్నాయి. ఇక మోడీకి సవాళ్ళు లేవని కాదు ఆయన హయాంలో దేశంలో పెరుగుతున్న ధరల పెరుగుదల పట్ల నిరుద్యోగం పట్ల జనంలో అసంతృప్తితో ఉన్నప్పటికీ, ప్రధానిగా మోదీపై ఉన్న నమ్మకం మాత్రం కొనసాగడం అంటే ఆయన వ్యక్తిగత ఇమేజ్ బలంగా ఉండడం, బలమైన నేత పోటీగా లేకపోవడం అని అంటున్నారు.

## ఇప్పటికిప్పుడు ఎన్నికలు..వైసీపీకి దక్కే సీట్లు !



ఏపీలో ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే వైసీపీ గెలుస్తుంది అని ఆ పార్టీ నేతలు ధీమా పడుతూ ఉంటారు. ఇటీవల ప్రెస్ మీట్ లో అధినేత జగన్ ని మీడియా వైసీపీకి అనుకూలంగా వచ్చిన సర్వే గురించి ప్రశ్నిస్తే జనాలలో అదే భావన ఉంది అన్నట్లుగా మాట్లాడారు. కానీ ఆ సర్వే సంగతి పక్కన పెడితే మూడ్ ఆఫ్ ది నేషన్ పేరుతో వచ్చిన తాజా సర్వే మాత్రం సంచలనం రేకెత్తిస్తోంది. దేశంలో ఇప్పటికిప్పుడు ఎన్నికలు పెడితే ఎన్డీయే గెలిచి తీరుతుందని ఆ సర్వే సారాంశం. అంతే కాదు దేశంలో వరసగా నాలుగోసారి కేంద్రంలో ఎన్డీయే ప్రభుత్వం ఏర్పాటు అవుతుందని కూడా సర్వే తేల్చేసింది. ఇది ఎన్డీయే ప్రత్యర్థులకు ఇబ్బందికరంగా ఉంది. అయితే ఇది ప్రస్తుతం దేశంలో ఉన్న పరిస్థితి అని సర్వే తేటతెల్లం చేస్తోంది. ఏపీ సంగతేంటంటే : ఇక ఇదే సర్వేలో ఏపీ సంగతి కూడా ప్రస్తావించింది. ఏపీలో 2024 ఎన్నిల్లో పాతిక ఎంపీ సీట్లకు గానూ ఎన్డీయే పార్టీలు 21 సీట్లను గెలుచుకున్నాయి. వైసీపీ నాలుగు ఎంపీ సీట్లను మాత్రమే గెలుచుకుంది. అయితే రెండేళ్ళ తరువాత కూడా ఏపీలో కూటమి బలం ఏ మాత్రం తగ్గలేదని ఈ సర్వే స్పష్టం చేస్తోంది. అంటే చంద్రబాబు నాయకత్వంలో టీడీపీ కూటమి ప్రభుత్వంలో కలిసి ఉన్న జనసేన బీజేపీ అంతా ఎన్నికల బరిలోకి దిగితే మరోసారి వారిదే విజయం అని ఈ సర్వే క్లారిటీగా చెబుతోంది. 2024 కంటే ఒక్క ఎంపీ సీటు తక్కువగా 20 సీట్లను ఎన్డీయే ఏపీలో కైవశం చేసుకుంటుంది అని సర్వే అంటోంది. వైసీపీకి అదనంగా లాభించేది ఏంటి అంటే ఒకే ఒక్క సీటు అని అంటోంది. అంటే ఏపీలో ఎపుడు ఎన్నికలు జరిగినా మేమే గెలుస్తామని వైసీపీ నేతలు జబ్బలు చరచుకున్నట్లుగా గ్రౌండ్ లో సీన్ లేదని మూడ్ ఆఫ్ ది ఏపీ చెప్పేసింది అని అంటున్నారు. ఒకసారి ఈ సర్వేను పక్కన పెట్టి చూసినా ఏపీలో కూటమి పార్టీలు కలసికట్టుగా ఉన్నాయి. ఎలాంటి పొరపొచ్చాలు లేకుండా ఐక్యతను ప్రదర్శిస్తున్నాయి. ఇక చంద్రబాబు రాజకీయ వ్యూహాలు పవన్ కళ్యాణ్ పొలిటికల్ గ్లామర్ ఆయనతో ఉన్న బలమైన సామాజిక వర్గం బీజేపీకి మోడీ ఇమేజ్ అలాగే కేంద్రం అండదండలు ఇవన్నీ కలసి కూటమి పటిష్టంగానే ఉంది అని ఎవరైనా చెబుతారు. దాంతో వైసీపీ ఒంటరి పోరు కూడా కూటమికి కొత్త బలాన్ని ఇస్తుందని అంటున్నారు. అందుకే ఈ సర్వేని నమ్మాల్సి వస్తోందని కూడా చెబుతున్నారు. కొంత తగ్గినా కూడా : ఇక రెండేళ్ళ పాలన తరువాత కూటమి బలం అయితే చెక్కు చెదరలేదని మూడ్ ఆఫ్ ది ఏపీ తెలియచేస్తోంది. దాంతో మరో మూడేళ్ళ తరువాత చూస్తే ఎంతో కొంత ఓటు షేర్ సీట్లు తగ్గితే తగ్గొచ్చు ఏమో కానీ మళ్లీ ఏపీలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం తథ్యమని కూడా స్పష్టం చేస్తోంది. మరి వైసీపీ ఏమి చేయాలి అంటే వైసీపీకి ఈ విధమైన రాజకీయ సమీకరణల మధ్య చేసేందుకు కూడా ఏమీ లేదని అంటున్నారు. వైసీపీ ఎంత చేసినా తన బలాన్ని ఒంటరిగానే నిరూపించుకోవాల్సి ఉంటుంది. 2014 మాదిరిగా 45 శాతం ఓటు షేర్ ని 2029 ఎన్నికల్లో గెలుచుకున్నా కూడా మూడు పార్టీలు కలసి అంత కంటే ఒకటి రెండు శాతం అధికమే తెచ్చుకుంటాయని అంటున్నారు. ఈ లెక్కన ఏపీలో కూటమికే చాన్స్ ఉంటుందని చెబుతున్నారు. కూటమిగా ఉన్నంత కాలం వైసీపీకి రాజకీయంగా ఇబ్బందే అని విశ్లేషణలు ఉన్నాయి.

## ఏపీలో ఇల్లులేని పేదలకు కేంద్రం తీపికబురు



ఇల్లు లేని నిరుపేదలకు ఇల్లు అందించటం కోసం ఏపీ, తెలంగాణా రాష్ట్రాలు పోటీ పడుతున్నాయి. ఇక తాజాగా ఆంధ్రప్రదేశ్‌లో గ్రామీణ ప్రాంతాల్లో ఇల్లు లేని పేదలకు కూటమి ప్రభుత్వం త్వరలో శుభవార్త చెప్పబోతుంది.. ప్రధానమంత్రి ఆవాస్ యోజన పీఎంఏవై గ్రామీణ-2.0 పథకం కింద రాష్ట్రానికి కొత్తగా 4 లక్షల ఇళ్లు వారం నుంచి పది రోజుల్లోగా కేంద్రం మంజూరు చేసే అవకాశం ఉందని చెప్తోంది. నాలుగు లక్షల కొత్త ఇళ్ళు ఇవ్వటానికి సుముఖంగా కేంద్రం కేంద్రం రాష్ట్రానికి నాలుగు లక్షల కొత్త ఇళ్ళు ఇవ్వటానికి సుముఖంగా ఉన్నట్టు పేర్కొంది. ఈ మేరకు రాష్ట్ర అధికారులు అర్హుల వివరాలను ఇప్పటికే కేంద్రానికి సమర్పించారు. కేంద్ర గృహనిర్మాణ శాఖ కూడా ఈ విషయంలో సానుకూలంగా స్పందించినట్లు సమాచారం. పీఎంఏవై-2.0 కింద ఇప్పటికే రాష్ట్రానికి 77 వేల గృహాలు మంజూరయ్యాయి. కొత్త 4 లక్షల ఇళ్లు మంజూరైన వెంటనే మొత్తం సంఖ్యను జిల్లాల వారీగా లబ్ధిదారులకు కేటాయించనున్నారు. వివిధ దశల్లో మరో 4 లక్షల గృహాలు గతంలో పీఎంఏవై పట్టణ-1.0 కింద దాదాపు 19 లక్షల గృహాలు మంజూరయ్యాయి. వాటిలో 2024కు ముందు మంజూరైనవి, ఇంకా నిర్మాణం ప్రారంభం కానివి 3.71 లక్షలు ఉన్నాయి. మరో 4 లక్షల గృహాలు వివిధ దశల్లో ఉన్నాయి. గత వైసీపీ ప్రభుత్వం ఇళ్ల స్థలాలను నివాసయోగ్యం కాని ప్రాంతాల్లో కేటాయించడంతో చాలా మంది నిర్మాణం చేపట్టలేదు. దీని కారణంగా కేంద్రం పాతవి పూర్తి చేసిన తర్వాతే కొత్తవి మంజూరు చేస్తామని పట్టుబట్టింది. రాష్ట్రంలో దాదాపు 9 లక్షల మంది ఇల్లు లేని పేదలు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కేంద్రంతో నిరంతరం సంప్రదింపులు జరిపి, 25 లక్షల బఫర్ స్టాక్ నుంచి 4 లక్షలు కేటాయించేలా ఒప్పించింది. రాష్ట్రంలో దాదాపు 9 లక్షల మంది ఇల్లు లేని పేదలు ఉన్నారు. గృహనిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి శుక్రవారం విజయవాడలో అధికారులతో ఈ మేరకు సమీక్ష నిర్వహించారు. ాశ్రీంశీ =ఘుస అంగన్వాడీ పోస్టుల భర్తీపై ప్రభుత్వం కీలక అప్డేట్! ఆదివాసీలకు మంజూరైన 43,592 గృహాలను గడువులోగా పూర్తి గత ప్రభుత్వం అస్తవ్యస్తం చేసిన లేఔట్లను నివాసయోగ్యంగా మార్చేందుకు నిధుల అంచనాలు రూపొందించాలని, నిర్మాణం ప్రారంభం కాని వారి వివరాలు సేకరించాలని ఆదేశించారు. పీఎం జన్‌మన్ కింద ఆదివాసీలకు మంజూరైన 43,592 గృహాలను గడువులోగా పూర్తి చేయాలని, దీనికోసం 9 జిల్లాలకు ప్రత్యేక అధికారులను నియమించాలని సూచించారు. ఒకవైపు ఇళ్ళు లేని వారికి ఇల్లు ఇస్తూనే మరోవైపు గత ప్రభుత్వ హయాంలో అస్తవ్యస్తం అయిన లే ఔట్ లను నివాస యోగ్యంగా మార్చనుంది.

## సీఎం విజయ్ ఆకస్మిక తనిఖీ

### జైలులో ఖైదీలతో నేరుగా మాట్లాడి..



తమిళనాడు ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ శుక్రవారం చెన్నై సమీపంలోని పుఝల్ సెంట్రల్ జైలులో ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. జైలు సదుపాయాలు, ఖైదీలకు అందుతున్న వైద్యం, ఆహారం, విద్య, వృత్తి శిక్షణ తదితర అంశాలను ఆయన పరిశీలించారు. ఖైదీలతో నేరుగా మాట్లాడి వారి అవసరాలు, సమస్యలను కూడా తెలుసుకున్నారు పుఝల్ సెంట్రల్ ప్రిజన్-1లోని పలు విభాగాలను సీఎం విజయ్ పరిశీలించారు. క్వారంటైన్ ప్రాంతం, సందర్శకుల హాల్, జైలు ఆసుపత్రి, డ్రగ్ డీ-అడిక్షన్ అండ్ రిహాబిలిటేషన్ సెంటర్, మహాత్మా గాంధీ కమ్యూనిటీ కాలేజీ తరగతి గదులు, లైబ్రరీ, అడ్వాన్స్‌డ్ కంప్యూటర్ ట్రైనింగ్ సెంటర్‌ను సందర్శించారు. హై-సెక్యూరిటీ బ్లాక్, ఉరిశిక్ష అమలు చేసే ప్రాంతాన్ని కూడా పరిశీలించారు. తనిఖీ సందర్భంగా ఖైదీలతో సీఎం విజయ్ నేరుగా మాట్లాడారు. వారికి అందుతున్న సదుపాయాలు, ఎదుర్కొంటున్న సమస్యలు, అవసరాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు ఖైదీలకు కేవలం శిక్ష విధించడం కాకుండా విద్య, నైపుణ్యాభివృద్ధి, వృత్తి శిక్షణ ద్వారా పునరావాసానికి అవకాశాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు (ూబఓష్ఘుశ్రీ ఝుఅశ్రీ ×అఝ్‌వం). జైలులో పుస్తకాల లభ్యతను కూడా పెంచాలని సీఎం సూచించారు. చదువు, నైపుణ్య శిక్షణ, ఖైదీల ఆసక్తులకు అనుగుణంగా వివిధ కార్యకలాపాలను అందుబాటులోకి తీసుకురావాలని పేర్కొన్నారు. పుఝల్ జైలులోని వృత్తి శిక్షణ కేంద్రాన్ని కూడా విజయ్ పరిశీలించారు. ఖైదీలు తయారు చేసిన ఇనుప ర్యాకులు, పేపర్ కవర్లు, ఆఫీస్ ఫైల్ బోర్డులతో పాటు హ్యాండ్లూమ్, టైలరింగ్ విభాగాల్లో తయారవుతున్న వస్తువులను పరిశీలించారు. ఖైదీలకు అందిస్తున్న ఆహారం నాణ్యతను కూడా తనిఖీ చేశారు. తమిళనాడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత విజయ్ ప్రభుత్వ సంస్థల్లో ఆకస్మిక తనిఖీలకు ప్రాధాన్యం ఇస్తున్నారు. గతంలో ప్రభుత్వ చిన్నారుల ఆసుపత్రిని, అనంతరం దళిత విద్యార్థుల ప్రభుత్వ హాస్టల్‌ను కూడా ఆయన ఆకస్మికంగా సందర్శించి అక్కడి పరిస్థితులను పరిశీలించారు.

## నేపాల్ వరదల్లో ఇన్ఫోసిస్ ఉన్నతాధికారి గోపిశెట్టి ఆచూకీ గల్లంతు





నేపాల్‌లో బీభత్సం సృష్టించిన ఆకస్మిక వరదల్లో ఇన్ఫోసిస్ పబ్లిక్ సర్వీసెస్ సీఈఓ లక్ష్మీనాథ్ గోపిశెట్టి ఆచూకీ గల్లంతైంది. ఆయన వ్యక్తిగత పర్యటన నిమిత్తం నేపాల్‌కు వెళ్లినట్లు ఇన్ఫోసిస్ వెల్లడించింది. ప్రస్తుతం ఆయనతో సంబంధాలు తెగిపోయాయని, ఆచూకీ కోసం సంబంధిత అధికారులతో కలిసి గాలిస్తున్నామని తెలిపింది. గోపిశెట్టి కుటుంబ సభ్యులతో సంస్థ సంప్రదింపులు జరుపుతూ, వారికి అవసరమైన సాయాన్ని అందిస్తున్నట్లు పేర్కొంది. కాగా.. నేపాల్-చైనా సరిహద్దు ప్రాంతంలో ఈ నెల 26న సంభవించిన జల ప్రళయంలో పలు రహదారులు, వంతెనలు, భవనాలు కొట్టుకుపోయాయి. ముఖ్యంగా నేపాల్‌లోని రసువా జిల్లా, చైనాలోని టిబెట్ ప్రాంతాల్లో భారీ నష్టం వాటిల్లింది. సహాయక చర్యలకు ప్రతికూల వాతావరణం, దెబ్బతిన్న రవాణా, సమాచార వ్యవస్థలు సవాలుగా మారాయి. ఈ విపత్తు కారణంగా వందలాది మంది భారతీయుల ఆచూకీ గల్లంతైనట్లు భారత విదేశాంగ శాఖ(వీజూూ) తెలిపింది. సుమారు 320 మంది భారతీయులు ఇంకా అందుబాటులోకి రాలేదని వెల్లడించింది. అటు చైనాలో సుమారు 400 మంది భారతీయులు చిక్కుకున్నప్పటికీ సురక్షితంగా ఉన్నారంది. ఆయా కుటుంబ సభ్యులు వారితో కాంటాక్ట్‌లో ఉన్నారని తెలిపింది. చైనా వైపు చిక్కుకున్న వారిలో కొంతమంది ఇప్పటికే నేపాల్‌కు చేరుకున్నారు. తమిళనాడుకు చెందిన 21 మంది భారతీయులు కూడా సురక్షితంగా ఢిల్లీ చేరుకున్నారు. నేపాల్‌లో సహాయక చర్యలు కొనసాగుతుండగా, గల్లంతైన భారతీయుల ఆచూకీ కోసం భారత దౌత్య అధికారులు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. గోపిశెట్టి ఇన్ఫోసిస్ పబ్లిక్ సర్వీసెస్‌కు నాయకత్వం వహిస్తూ ప్రభుత్వ రంగ సంస్థలకు వ్యూహరచన, సాంకేతికత, కార్యకలాపాలు, డిజిటల్ పరివర్తనలో సలహాదారుడిగా వ్యవహరిస్తున్నారు. గతంలో ఇన్ఫోసిస్‌లో గ్లోబల్ వైస్ ప్రెసిడెంట్‌గా, యాక్సెంచర్‌లో మేనేజింగ్ డైరెక్టర్‌గా పనిచేశారు.

## పశ్చిమ బెంగాల్ మాజీ సీఎం మమతా బెనర్జీపై కేసు నమోదు




పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీపై కేసు నమోదైంది. తృణమూల్ ఛాత్ర పరిషత్ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా కోల్‌కతా హైకోర్టు ఉత్తర్వులను ఉల్లంఘించారంటూ కోల్‌కోతా పోలీసులు శనివారం సుమోటాగా మమతా బెనర్జీపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. హేస్టింగ్స్ పోలీస్ స్టేషన్‌లో మమతతో పాటు తృణమూల్ ఛాత్ర పరిషత్ కార్యక్రమ నిర్వాహకులపై కూడా కేసు నమోదు చేశారు.

పోలీసులు చెబుతున్న దాని ప్రకారం.. సెంట్రల్ కోల్‌కతాలోని 'క్యాథెడ్రల్ రోడ్'లో కేవలం ఒక వైపు మాత్రమే సభ నిర్వహించుకోవాలని, రెండో వైపు వాహనాల రాకపోకల కోసం ఖాళీగా ఉంచాలని హైకోర్టు ఆదేశించింది. కానీ, టీఎంసీ కార్యకర్తలు రోడ్డు మొత్తాన్ని ఆక్రమించడంతో తీవ్ర ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. నిర్వాహకులు కోర్టు నిర్దేశించిన సమయం కంటే ఎక్కువ సేపు ఈ కార్యక్రమాన్ని కొనసాగించారు. సభలో పాల్గొన్న మద్దతుదారులు పోలీసు బారికేడ్లను నెట్టివేస్తూ, భద్రతా సిబ్బందితో ఘర్షణకు దిగారు. దీనిపై ఓ పోలీస్ అధికారి మాట్లాడుతూ.. 'కోర్టు ఆదేశాలను ఉల్లంఘించారనే కారణంతో మమతా బెనర్జీతో పాటు కార్యక్రమ నిర్వాహకులపై ఎఫ్ఐఆర్ నమోదు చేశాము. దర్యాప్తులో భాగంగా అందరినీ విచారిస్తాము' అని అన్నారు.

## కంగనకు స్వీట్లు పంపిన రామ్‌దేవ్..



న్యూఢిల్లీ : నటి, ఎంపీ కంగనా రనౌత్.. బాబా రామ్‌దేవ్ మధ్య గొడవలు, మాటల యుద్ధం ముగిసింది! రాఖీ పండుగ సందర్భంగా బాబా రామ్‌దేవే చొరవ చూపి గొడవకు ముగింపు పలికారు. ఢిల్లీలో నిరసనలు చేపట్టిన జన్‌జీని యువతను ఉద్దేశించి జనరేషన్ గట్టర్ అంటూ కంగన తీవ్ర వ్యాఖ్యలు చేయడాన్ని రామ్‌దేవ్ తప్పుపట్టిన సంగతి తెలిసిందే. దీనిపై కొన్నాళ్లుగా ఇద్దరి మధ్య మాటల యుద్ధం సాగుతోంది. ఈ క్రమంలో శుక్రవారం హరిద్వార్‌లో బాబా రామ్‌దేవ్ మీడియాతో మాట్లాడుతూ.. కంగనను తాను సోదరిగా భావిస్తున్నానని.. ఆమెకు రాఖీ పండుగ సందర్భంగా స్వీట్లు, కానుకలను పోస్టు ద్వారా పంపుతున్నట్లు పేర్కొన్నారు. బాబా రామ్‌దేవ్ చొరవకు అటు కంగన సానుకూలంగా స్పందించారు. "పండుగ రోజు అంటే తప్పొప్పులను క్షమించి మరిచిపోయేరోజు. వివాదం వద్దు.. చర్చే ముద్దు అంటూ మా అన్నయ్య రామ్‌దేవ్ మంచి మాట చెప్పారు. అన్నయ్య ప్రేమను నేను మనస్ఫూర్తిగా స్వీకరిస్తున్నాను" అని వ్యాఖ్యానించారు.

## పారదర్శకంగా రీ-సర్వే ప్రక్రియను పూర్తి చేయాలి

### సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు



ఐ. పోలవరం, ఆగస్టు 29 (జియస్‌బి వార్త): కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న భూముల రీ-సర్వే కార్యక్రమాన్ని రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, పూర్తి పారదర్శకతతో అమలు చేయాలని ప్రభుత్వ విప్, ముమ్మిడివరం నియోజకవర్గ శాసనసభ్యులు దాట్ల సుబ్బరాజు అధికారులను ఆదేశించారు. భూముల రీ-సర్వే కార్యక్రమం అమలులో భాగంగా శనివారం రీ-సర్వే ప్రక్రియపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి అమలాపురం ఆర్డీవో సరళాదేవి హాజరయ్యారు. రెవెన్యూ, దేవాదాయ శాఖల అధికారులు మరియు సిబ్బందితో ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు రీ-సర్వే కార్యక్రమం పురోగతిపై సమగ్రంగా సమీక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రీ-సర్వే నిర్వహించే సమయంలో రైతులకు పూర్తి స్థాయిలో అవగాహన, సమాచారం కల్పించాలని సూచించారు. రీ-సర్వే ప్రక్రియపై రైతులకు తలెత్తే సందేహాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేస్తూ వారికి అవసరమైన సహాయ సహకారాలు అందించాలని అధికారులకు తెలిపారు. రైతులు ఎటువంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా సున్నితంగా వ్యవహరించాలని, రీ-సర్వే ప్రక్రియలో పారదర్శకతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. అవసరమైన అన్ని ప్రభుత్వ శాఖలతో సమన్వయం చేసుకుంటూ కార్యక్రమాన్ని సమర్థవంతంగా, నిర్ణీత విధానాల ప్రకారం పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. రీ-సర్వే కార్యక్రమం రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని సమర్థవంతంగా సాగాలని, ప్రతి దశలో అధికారుల మధ్య సమన్వయం ఉండాలని ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో రెవెన్యూ, దేవాదాయ శాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత గా మొక్కలు నాటిన ఆలయన్స్ క్లబ్



కరప (జిఎస్ బి వార్త) కరప మండలం నడకుదురు తులసి నగర్ నందు శనివారం పర్యావరణ పరిరక్షణలో భాగంగా అసోసియేషన్ ఆఫ్ అలయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ పద్మారావు ఎల్ ఎమ్ ఎఫ్ క్లబ్ ట్రెజరర్ ఆలయన్స్ కొమ్మన తాతారావు అధ్యక్షతన నడకుదురు తులసి నగర్ నందు మొక్కలు నాటే కార్యక్రమాన్ని మన జిల్లా గవర్నర్ కె వి వి సత్యనారాయణ తులసి నగర్ నందు పర్యావరణ పరిరక్షణలో భాగంగా జిల్లా మొత్తం వేల సంఖ్యలో మొక్కలు నాటాలనే కార్యక్రమం తలపెట్టారు అందులో భాగంగా సుమారు 200 మొక్కలు తులసి నగర్ లో గవర్నర్ చేతుల మీదుగా ప్రారంభించారు . ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా అలయన్స్ గవర్నర్ కె వి వి సత్యనారాయణ మరియు ఇంటర్నేషనల్ కమిటీ చైర్మన్ ఆలయం వనం శ్రీనివాసరావు క్లబ్ ట్రెజరర్ కే తాతారావు,క్లబ్ మెంబర్స్ తులసి నగర్ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కలు నాటే కార్యక్రమాన్ని చక్కగా నిర్వహించారు.

## బీఎస్ఎన్ఎల్ టెలిఫోన్ టవర్‌కు శంకుస్థాపన



ఉదయగిరి (జిఎస్ బి వార్త) : ఇజుమూరు మండలం జనార్ధన్‌పురం గ్రామంలో బీఎస్ఎన్ఎల్ టెలిఫోన్ టవర్ నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, న్యాయ మరియు మైనార్టీ సంక్షేమ శాఖల మంత్రి ఎండీ ఫరూక్ ముఖ్య అతిథులుగా పాల్గొని టెలిఫోన్ టవర్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన టెలికాం సౌకర్యాలు అందుబాటులోకి తీసుకురావడం ప్రభుత్వ లక్ష్యమన్నారు. జనార్ధన్‌పురం, పరిసర గ్రామాల ప్రజలకు బీఎస్ఎన్ఎల్ టెలిఫోన్ టవర్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. ముఖ్యంగా విద్యార్థులు, రైతులు, వ్యాపారులు, ఉద్యోగులు, యువతకు మెరుగైన కమ్యూనికేషన్ సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. మారుమూల ప్రాంతాల్లోనూ డిజిటల్ కనెక్టివిటీని బలోపేతం చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. ప్రజల అవసరాలను గుర్తించి మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నామని, నియోజకవర్గ అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారని మంత్రులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా పరిషత్ అధ్యక్షులు చెంచాల బాబు, మాజీ ఎమ్మెల్యే కంభం విజయరాఘవారెడ్డి,మండల కన్వీనర్ గూడా నర్సిరెడ్డి, టెలికం అడ్వైజర్ కమిటీ మెంబర్ తాటికొండ అనూష, యూత్ లీడర్ వంశీ, వని పెద్ది సుబ్బారెడ్డి, వనిపెద్ది హైమావతి ఇంజుమూరు ఎంపీపీ కూడెళ్ళ వెంకటేశ్వర్లు రవీంద్రబాబు,స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వేములవాడ లో విద్యుత్ సరఫరా నిలిపివేతతో

### లక్షల విలువైన చేపలు మృతి రైతు ఆందోళన



కరప, ఆగస్టు 29:(జిఎస్ బి వార్త) కరప మండలం వేములవాడ గ్రామంలోని ఐదు ఎకరాల చేపల చెరువులకు సంబంధించిన విద్యుత్ బిల్లులో ప్రధాన మొత్తాన్ని ఇప్పటికే చెల్లించామని, కేవలం అదనపు బిల్లు మాత్రమే బకాయి ఉందని తెలిపారు. స్థానిక లైన్‌మెన్ విద్యుత్ సరఫరాను నిలిపివేయడంతో చెరువుల్లో ఆక్సిజన్ అందించే మోటార్లు ఆగిపోయాయని, దీంతో చేపలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యాయని నారాయణరావు తెలిపారు. తాను బయట ఉన్నానని ఆ మొత్తాన్ని కూడా రెండు రోజుల్లో చెల్లిస్తానని, అప్పటి వరకు కొంత సమయం ఇవ్వాలని స్థానిక విద్యుత్ సిబ్బందిని కోరినప్పటికీ స్పందించలేదని ఆరోపించారు . విద్యుత్ బిల్లులో అదనపు చార్జీలు బకాయి ఉన్నాయన్న కారణంతో విద్యుత్ సరఫరా నిలిపివేయడంతో చెరువుల్లో ఆక్సిజన్ అందించే మోటార్లు పనిచేయక లక్షలాది రూపాయల విలువైన చేపలు మృత్యువాత పడ్డాయని బాధిత రైతు వనుం నారాయణరావు ఆవేదన వ్యక్తం చేశారు. బాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం. పరిస్థితి విషమంగా మారడంతో వెంటనే సంబంధిత విద్యుత్ ఏఈకి ఫోన్ చేసి విషయాన్ని వివరించానని, బిల్లు చెల్లిస్తానని, వెంటనే విద్యుత్ సరఫరా పునరుద్ధరించాలని కోరినా సరైన స్పందన రాలేదని పేర్కొన్నారు. మోటార్లు పనిచేయక చెరువుల్లో ఆక్సిజన్ స్థాయిలు పడిపోవడంతో వేలాది చేపలు నీటిపైకి తేలి మృత్యువాత పడ్డాయని రైతు వాపోయారు.

## రూ.72.42 కోట్లతో చేపట్టిన హార్బర్ ఆధునీకరణ పనులు వేగవంతం చేయాలి..

### దిశా కమిటీ చైర్మన్, కాకినాడ పార్లమెంటు సభ్యులు తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్





కాకినాడ, ఆగస్టు 29:(జిఎస్ బి వార్త) : ప్రజా సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాల పై క్షేత్రస్థాయిలో ప్రజలకు విస్తృత అవగాహన కల్పించి, మరింత మందికి లబ్ధి చేకూరేలా అధికారులు సమన్వయంతో పని చేయాలని కాకినాడ పార్లమెంటు సభ్యులు,దిశా కమిటీ చైర్మన్ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ అధికారులను కోరారు. శనివారం కాకినాడ జిల్లా ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో జిల్లా అభివృద్ధి సమన్వయ,పర్యవేక్షణ (దిశా) కమిటీ సమావేశం దిశా కమిటీ చైర్మన్, కాకినాడ పార్లమెంటు సభ్యులు తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ అధ్యక్షతన, జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించబడింది. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ,అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణా రెడ్డి, జిల్లా సహకార కేంద్ర బ్యాంకు చైర్మన్ తుమ్మల రామస్వామి,కమిటీ సభ్యులు,వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో కేంద్ర ప్రభుత్వ నిధులతో మంజూరైన అభివృద్ధి సంక్షేమ పనుల పురోగతిని దిశా కమిటీ సభ్యులు, వివిధ శాఖల అధికారులతో కలిసి చర్చించారు. ప్రధానంగా మహిళా శిశు సంక్షేమశాఖలో అమలవుతున్న పోషణ్ వాటిక, వన్ స్టాప్ సెంటర్, ఇంటిగ్రేటెడ్ చైల్డ్ ప్రొటెక్షన్, బేటీ బచావో – బేటి పడావో, మిషన్ వాత్సల్య, అంగన్వాడీ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు; పాఠశాల విద్యా శాఖకు సంబంధించి ప్రధానమంత్రి పోషణ్ – డొక్కా సీతమ్మ మధ్యాహ్నం భోజనం, పీఎం శ్రీ స్కూల్స్, సమగ్ర శిక్ష అభియాన్, రైట్ టు ఎడ్యుకేషన్ యాక్ట్ కింద ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం అడ్మిషన్లు భర్తీ, వ్యవసాయ శాఖకు సంబంధించి ప్రధానమంత్రి పషల్ బీమా యోజన, రాష్ట్రీయ కృషి వికాసం యోజన, నేచురల్ ఫామింగ్ కార్యకలాపాలు; ఏపీ మారిటన్ బోర్డు నుంచి కాకినాడ గేట్ వే పోర్టు, ఉప్పాడ ఫిషింగ్ హార్బర్, కాకినాడ డీప్ వాటర్ పోర్ట్, ఫిషింగ్ అర్బన్ ఆధునికరణ పనులు; గ్రామీణ నీటి సరఫరా శాఖ ద్వారా జలజీవన్ మిషన్ కింద ఇంటింటికి తాగునీరు పనులకు పురోగతి, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ కింద పీఎంజీఎస్వై పనులు, స్కిల్ డెవలప్మెంట్ ద్వారా నిరుద్యోగ యువతకు శిక్షణ కార్యక్రమాలు అమలు; పశు సంవర్ధక,క్రీడా ప్రాధికార సంస్థ తదితర శాఖలలో అమలవుతున్న పనుల ప్రగతిని ఈ సందర్భంగా దిశా సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. జిల్లాలో వ్యవసాయ, విద్య, మహిళా శిశు సంక్షేమం ఇతర శాఖలలో జాతీయ పథకాల లక్ష్యాలను, ఆధునిక డ్రోన్ల సాంకేతికతను సమర్థవంతంగా అమలు చేసి, మరింత మందికి లబ్ధి చేకూరిలా అధికారులు కృషి చేయాలన్నారు. కాకినాడ పరిసర ప్రాంతాల్లో భవిష్యత్తులో రాబోయే పరిశ్రమలకు అవసరమైన మానవ వనరులను దృష్టి లో ఉంచుకుని,ముందే ప్రత్యేక నైపుణ్యాలపై యువతకు శిక్షణ ఇచ్చే దిశ గా అధికారులు ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. ముఖ్యంగా షిప్ బిల్డింగ్, కంటైనర్ తయారీ రంగంలో అపారమైన ఉపాధి అవకాశాలు ఉన్నందున, దానికోసం ప్రత్యేకంగా ఒక శిక్షణా కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ అధికారులకు సూచించారు. ప్రధానంగా ఫిషింగ్ హార్బర్ ఆధునీకరణకు రూ. 72.42 కోట్లు కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిందని ఎంపీ తెలిపారు. ఈ నిధులు మంజూరై మూడు నెలలు గడుస్తున్నప్పటికీ క్షేత్రస్థాయి లో ఎటువంటి పురోగతి లేకపోవడం పై ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. సుమారు రెండు దశాబ్దాలు గా పెండింగ్‌లో ఉన్న ఈ ఆధునీకరణ పనులు పూర్తయితే కాకినాడ టౌన్, రూరల్ ప్రాంతాల మత్స్య కారుల జీవనోపాధి మెరుగు పడుతుందని స్పష్టం చేశారు. రాష్ట్ర మారిటైమ్ బోర్డు అధికారులు తక్షణమే స్పందించి,రానున్న ఒక వారం లోగా టెండర్ ప్రక్రియ ను పూర్తి చేసి పనులు ప్రారంభించాలని ఎంపీ స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం మత్స్యకారుల, రైతుల సంక్షేమం,సాగునీటి పారుదల రంగాలు,పంటల బీమా అమలుపై కీలకమైన నిర్ణయాల అమలుకు ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని తెలిపారు. పంటల బీమాకు సంబంధించి గోదావరి జిల్లా వ్యాప్తంగా ఒకే రకమైన ఏకరూప పంటల బీమా వర్తించేలా ప్రత్యేక తీర్మానం చేసి ప్రభుత్వానికి నివేదించ నున్నట్లు తెలిపారు. ప్రకృతి వ్యవసాయం సాగు ను ప్రోత్సహిస్తూ రైతులకు పెద్ద ఎత్తున అవగాహన సదస్సులు కచ్చితంగా నిర్వహించాలని... ఎరువుల వాడకంతో జరిగే అనర్థాలను వివరిస్తూ శిక్షణా కార్యక్రమాల నిర్వహణ ఉండాలన్నారు. మొక్కుబడిగా కాకుండా ప్రయోగాత్మకంగా శిక్షణ తరగతులు ఉండడం ద్వారా సత్ఫలితాలు ఉంటాయని వ్యవసాయ శాఖ అధికారులకు ఎంపి సూచించారు.. మున్సిపల్ శాఖ,క్రీడా రంగాలు అద్భుతంగా పనిచేస్తున్నాయని కొనియాడుతూ,సహజ వ్యవసాయాన్ని మరింత విస్తృతం చేసేందుకు క్షేత్రస్థాయిలో పర్ఫార్మర్లను ప్రోత్సహించాలని సూచించారు. జలజీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటి కి సురక్షిత తాగునీరు అందించే పనులను వచ్చే మార్చి లోపు పూర్తి చేయాలని అధికారులను సూచించారు. అలాగే పైపులైన్ల పనుల అనంతరం దెబ్బతిన్న రోడ్లకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని కలెక్టర్ ను కోరారు. స్థానిక పోర్టు యాజమాన్యం సహకారం తో ఇండోర్ స్టేడియానికి ఏసీ సౌకర్యం కల్పించే విధంగా తక్షణమే ప్రతిపాదనలు పంపిస్తామన్నారు. దిశా సమావేశంలో వివిధ శాఖల ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొని, ప్రజా సమస్యలపై కూలంకషంగా చర్చించి తగిన పరిష్కారాల మార్గాలు సూచించినట్లు ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ తెలిపారు.

కేంద్ర ప్రభుత్వం నిధులతో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలపై దిశా కమిటీ ద్వారా ప్రత్యేక సమీక్ష.. – జిల్లా కలెక్టర్ ఎం. ఎన్.హరేంధిర ప్రసాద్

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ.. జిల్లాలో జరుగుతున్న వివిధ అభివృద్ధి,సంక్షేమ పథకాల పై సమగ్రంగా సమీక్ష నిర్వహించడం జరిగిందన్నారు. జిల్లాలో కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత పథకాల (సెంట్రల్ స్పాన్సర్డ్ స్కీమ్స్) అమలుపై ప్రధానం గా దృష్టి సారించిన ఈ సమావేశంలో,గత సమావేశంలోని సూచనలపై తీసుకున్న చర్యల నివేదిక ను (యాక్షన్ టేకన్ రిపోర్ట్) విస్తృతంగా చర్చించడం జరిగిందని జిల్లా కలెక్టర్ తెలిపారు. ముఖ్యంగా ఉద్యానవనం (హార్టికల్చర్), వైద్య, ఆరోగ్య శాఖ, మహిళా మరియు శిశు సంక్షేమం, విద్య, అగ్రికల్చర్, ఇండస్ట్రీస్, స్కిల్ డెవలప్‌మెంట్, మున్సిపల్ శాఖలతో పాటు పీవీజీ రామ్‌జీ,పీఎంఈజీపీ, ప్రధాన మంత్రి కౌశల్ వికాస్ యోజన, పోర్ట్‌అనుసంధాన పథకాలు క్షేత్రస్థాయిలో సక్రమంగా అమలు జరిగేలో నిరంతర పర్యవేక్షణ చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ తెలిపారు. డిసిసిబి చైర్మన్ తుమ్మల రామస్వామి మాట్లాడుతూ... పంటల బీమా పథకం ద్వారా ఎక్కువ మంది రైతులు లబ్ధి పొందేలా జిల్లా కలెక్టర్ తీసుకున్న చొరవతో ఎక్కువ మంది రైతులు బీమా మొత్తాన్ని చెల్లించి లబ్ధి పొందే అవకాశాన్ని కల్పించినందుకు జిల్లా కలెక్టర్ ని డిసిసిబి చైర్మన్ అభినందించారు. అనపర్తి శాసన సభ్యులు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ.. పేద వర్గాల సంక్షేమాన్ని అభివృద్ధి ని దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని, వీటి ప్రయోజనం గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు అందేలా పూర్తిస్థాయిలో అవగాహనకల్పించాలన్నారు. తద్వారా ఎక్కువమంది కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగంచేసుకునేందుకు అవకాశం ఉంటుందని సూచించారు. ఎల్ ని నో ప్రభావం గురించి రైతులకు అవగాహన కల్పించాలన్నారు కేంద్ర ప్రభుత్వం ద్వారా వివిధ ప్రాజెక్టులను జిల్లాకు తీసుకోవడంలో కృషి చేస్తున్న ఎంపీ గారిని శాసనసభ్యులు ఈ సందర్భంగాఅభినందించారు. ఈ సమావేశంలో జెడ్పీ సీఈవో లక్ష్మణరావు, డిప్యూటీ సీఈఓ డి. శ్రీ లలిత, పరిపాలనాధికారి ఎం. బుజ్జి బాబు, తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పలంకలో టీడీపీ ఇంటింటికి ప్రచారం

### రెండేళ్ల పాలనలో అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట..



కరప, ఆగస్టు 29:(జిఎస్ బి వార్త) : కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా కరప మండలం ఉప్పలంక గ్రామంలో శనివారం టీడీపీ ఆధ్వర్యంలో ప్రచార కార్యక్రమం నిర్వహించారు. పేద, బడుగు బలహీన వర్గాల సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని టీడీపీ కాకినాడ రూరల్ ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి, సత్యనారాయణమూర్తి దంపతులు అన్నారు. మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు, మాజీ జడ్పీటీసీ నులుకుర్తి వెంకటేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి పెంకే శ్రీనివాస్ బాబా, పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి పిల్లి అనంతలక్ష్మి, సత్యనారాయణమూర్తి దంపతులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ సహకారంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపిస్తోందన్నారు. గత రెండేళ్లలో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించి, వాటి ద్వారా లబ్ధి పొందుతున్న తీరును తెలియజేశారు. పేదల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధికి కూటమి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ బుంగా సింహాద్రి, టిడిపి కాకినాడ పార్లమెంటు ఆర్గనైజింగ్ సెక్రటరీ దేవు వెంకటేశ్వరరావు, క్లస్టర్ ఇన్‌చార్జ్ మద్దూరి స్వామి, గండి వెంకటేశ్వరరావు నాయకులు బొమ్మిడి తాతారావు, మల్లాడి భవాని రాంబాబు, సంగాని బాల మహేశ్వరరావు, షేర్ నూకరాజు, పంతాడి చిన్ననూకరాజు, రేకాడి వీరబాబు, పంతాడి దుర్గారావు, గేదెల సత్తిబాబు సంగాని సోమరాజు చాట్ర ఇమ్మానియేలు, చీపురుపల్లి జయేంద్రబాబు, వాసంశెట్టి ఉమా, పలివెల జానకి రామయ్య, గంజా రాంబాబు, కాళ్ల శ్రీను, ఎలగా లోవరాజు, నర్సింగరావు, కోనాల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ' మిషన్ వాత్సల్య' నిధులను పిల్లల చదువు, వైద్యానికే వినియోగించాలి: డీసీపీవో సిహెచ్. వెంకట్రావు



కాకినాడ సిటీ ఆగస్టు 29 జి ఎస్ బి వార్త : ప్రభుత్వం 'మిషన్ వాత్సల్య' పథకం కింద అందించే ఆర్థిక సాయాన్ని పిల్లల చదువు, వైద్య అవసరాల కోసమే సద్వినియోగం చేసుకోవాలని జిల్లా బాలల పరిరక్షణ అధికారి (డీసీపీవో) సిహెచ్. వెంకట్రావు పిలుపునిచ్చారు. జిల్లా మహిళా అభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ సిహెచ్. లక్ష్మి ఆదేశాల మేరకు, కాకినాడ అర్బన్ ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయంలో ఇన్‌చార్జ్ సీడీపీవో జి. ఉష అధ్యక్షతన స్పాన్సర్‌షిప్ లబ్ధిదారులతో ముఖాముఖి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సిహెచ్. వెంకట్రావు మాట్లాడుతూ.. అనాథలు, పాక్షిక అనాథలు, హెచ్ఐవీ/దీర్ఘకాలిక వ్యాధులు మరియు కోవిడ్ బాధిత కుటుంబాల్లోని 18 ఏళ్ల లోపు పిల్లల సంక్షేమం కోసమే మిషన్ వాత్సల్య పథకం అమలువుతోందని తెలిపారు. ప్రాజెక్ట్ పరిధిలోని సుమారు 74 కుటుంబాల స్థితిగతులను, పిల్లల విద్యా, వైద్య సదుపాయాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సీడీపీవో జి. ఉష మాట్లాడుతూ.. కాకినాడ అర్బన్ పరిధిలో 74 కుటుంబాలకు ప్రతినెలా రూ. 4,000 చొప్పున ఆర్థిక సహాయం అందుతోందని తెలిపారు. సంరక్షకులు పిల్లలను తమ సొంత బిడ్డల్లా చూసుకుంటూ సరైన విద్య, సమయానికి వైద్యం అందించే బాధ్యత తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ (సీడబ్ల్యూసీ) సభ్యుడు పి. వెంకట్రావు లబ్ధిదారులతో మాట్లాడగా, ప్రభుత్వం ఇచ్చే ఆర్థిక సాయం పిల్లల చదువులకు, అత్యవసర వైద్య ఖర్చులకు ఎంతో ఆసరాగా ఉంటోందని లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు.?ఈ కార్యక్రమంలో జిల్లా బాలల పరిరక్షణ విభాగం ప్రొటెక్షన్ ఆఫీసర్లు కె. శ్రీనివాస్, జె. విజయ, సోషల్ వర్కర్ చిన్నబాబు, ఐసీడీఎస్ సూపర్వైజర్లు, చైల్డ్ హెల్ప్‌లైన్ మరియు చైల్డ్ ఫండ్ సిబ్బంది, లబ్ధిదారులు, వారి సంరక్షకులు పాల్గొన్నారు.

## జిజిహెచ్ లో వైద్య సేవలు మెరుగు పరచాలి

### కలెక్టర్, ఎమ్మెల్యే, ఎంపీ సహా ఆసుపత్రి అభివృద్ధి మండలి సభ్యులకు వినతి పత్రాలు సమర్పించిన సిపిఎం - సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే, ఎంపీలు



